# రత్తాలు

చంద్రం హడావుడి ఎప్పుడూ ఉన్నదే! హాస్పిటల్ నుంచి ఒచ్చిందో అడుగు రాందో అడుగు. "అర్జంటుగా వడ్డించెయ్ అమ్మా. తొందరగా వెళ్ళిపోవాలి" అంటాడు. ఆపరేషన్లు ఉన్నరోజున ఇంకా చెప్పనే అక్కరలేదు. ఏక ఉరకలు పరుగులు. నించోనియ్యాడు నిలబడనియ్యాడు. ఈ రెండేళ్ళనుంచీ, ముఖ్యంగా చంద్రానికి ఈ ఊరు బదిలీ అయినప్పటి నుంచీ, ఆ హడావుడికీ కంగారుకీ రత్తాలు బాగా అలవాటు పడింది. తన సుఖాన్ని చూసుకోకుండా రాత్రింబగళ్ళు రోగుల సేవలో మునిగితేలుతూన్న కొడుకుని చూస్తూంటే, ఓప్రక్కన ఇంతటివాడిగా తయారుచెయ్య గలిగాముకదా అని సంతృప్తితో కూడిన ఆనందం, మరోపక్కన "అయ్యో కుర్రనాగమ్మ నలిగిపోతున్నాడే! ఆయన ఆశయాన్ని నెరవేర్చాలనే పట్టుదలతో ఈ డాక్టరీ చదివించి కుర్రవాడిని ఎంత శ్రమపెడుతున్నానని పశ్చాత్తాపంతో కూడిన విచారం. ఈ రెండింటికీ మధ్య ఊగిసలాడుతూ ఇన్నాళ్లూ, చంద్రం హాస్పిటల్‌కీ ఇంటికీ మధ్య చేస్తున్న రన్నింగ్ రేసులు చూస్తూ, ఏం కల్పించుకోకుండా ఊరుకుంది.

కాని ఇవ్వాళ అతని కంగారు వట్టి కంగారు మాత్రమే కాదు. దాని వెనకాల ఎంతో ఆవేదన, ఎంతో ఆందోళన

మరెంతో బాధ కన్పిస్తున్నాయి రత్తాలుకి. అందుకే మామూలులాగ ఊరుకోలేకపోయింది. అసలు ఏం జరిగిందో ఎందు కతని మొహంలో అంత దిగులు కనిపిస్తోందో తెలుసుకోవాలనుకుంది. అందుకే వడ్డించిన వేడివేడి అన్నం చల్లారడం కోసం పక్కనే పీటమీద కూచుని విసురుతూ "ఏవిరా అబ్బాయి! ఇవాళ అలా ఉన్నావు!" అంది.

అన్నం కలుపుకుంటూ పరధ్యానంగా ఉన్న చంద్రం ఉలిక్కిపడి 'ఏమిటమ్మా' అన్నాడు.

రత్తాలు నవ్వుతూ "ఏవిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? చెయ్యబోయే ఆపరేషను గురించా?" అంది.

"చెయ్యబోయేది కాదమ్మా, చేసేసిందే!"

"చేసేసిన దాని గురించి ఇంక ఆలోచన దేనికి?"

ఆపరేషను అయితే చేసేశాననుకో. కాని పేషెంటు బ్రతుకుతాడా అన్నదే అనుమానం"

"అంత ప్రమాదమైన జబ్బా?"

"కేన్సర్ తాలూకు విషం, నేను ఆపరేషన్ చెయ్యక ముందే రక్తంలో ప్రవేశించింది. అలాంటప్పుడు బ్రతకడం కష్టం."

"అయ్యో పాపం! వయస్సే మాత్రం?"

"ఉంటాయి దగ్గర దగ్గర ఏభై"

"భార్యా పిల్లలూ..."

"భార్య ఎప్పుడో పోయిందట. కొడుకు ఒకడున్నాట్ట కాని వాడెందుకూ పనికిమాలినవాడిగా తయారయి పట్నంలో తిరుగుతూ ఉంటాడట!"

"ఈయన బీదవాడేమో. అందుకే ఆ కొడుకు కలా చదువూ సంధ్యా లేకుండా..."

"కాదమ్మా-చాలా శ్రీమంతుడూ అంతకంటే ఎంతో మంచివాడు కూడాట. కొత్తగా వచ్చాంకనక మనకి తెలియదుకాని ఆయన్ని మా హాస్పిటల్ స్టాఫ్ అంతా ఎరుగుదురట! చాలా సంస్థలకి చాలా మంది బీదవిద్యార్థులికీ సాయం చేస్తూ ఉంటాడుట — ఏదో ఊరికి జమీందారుకూడాట"

చంద్రం చెబుతున్న మాటలు యధాలాపంగా వింటూ మజ్జిగ పొయ్యడంకోసం గిన్నె ఎత్తింది రత్తాలు.

"ఆఁ...జ్ఞాపకం వచ్చింది — పల్లయ్యగూడెం అని ఇక్కడికో ఏభై మైళ్ళ దూరంలో ఓ వూరు ఉంది. దానికి జమీందారుటమ్మా! ఆయన" అన్నాడు చంద్రం.

"ఆఁ!" అని ఒక్క కేకవేసి చేతిలోవున్న గిన్నె వదిలేసింది రత్తాలు. చంద్రం కంగారుపడి "ఏమయిందమ్మా, అలా అంత గట్టిగా అరిచావేం?" అన్నాడు.

తన ముఖంలో ఏర్పడ్డ వైవర్ణ్యాన్నీ, కళ్ళల్లో నిలిచిన నీళ్ళనీ కనిపించనీయకుండా "అబ్బే - ఏమీలేదు ఏమీలేదు అంది. ఇంకా అలాగే చూస్తున్న చంద్రంతో "మరేం లేదురా — పల్లయ్యగూడెం అంటే మా అయ్య జ్ఞాపకం వచ్చాడు. మా అయ్య ఆ వూళ్లో ఉండేవాడులే - నువ్వు కడుపున పడేదాకా నేనూ అక్కడే ఉన్నా - ఏవో - మా అయ్య, నా చిన్నతనం అన్నీ జ్ఞాపకం వచ్చి..." దుఃఖంతో

గొంతుకు పూడిపోగా ఇంకా పైన వాక్యం పూర్తి చెయ్య లేకపోయింది.

రత్తాలు ఎంత ప్రయత్నం చేస్తూఉన్నా ఆమె కళ్ళు రెండూ ఎర్రని చెరువుల్లా మారుతున్నాయి. అమ్మలో వచ్చిన ఈ మార్పుకి కారణం అర్థంకాక చంద్రం ఇంకా ఆమెకేసి చూస్తూ ఉండిపోయాడు. తనలో ఏర్పడ్డ సంచల నాన్ని చంద్రం ఎక్కడ పసిగట్టేస్తాడో అనే భయంతో వెంటనే పైటతో కళ్ళు ఒత్తుకొని "ఏమిటి అమట్టునే కూచుండిపోయావు. అవతల అర్జంటు కేసు ఉందికదా. చప్పున భోజనంచేసి వెళ్ళు" అని కసురుకొంది. 'అమ్మ హఠాత్తుగా ఎందుకలా అయింది' అని వితర్కించుకొంటూ హాస్పిటల్‌కి బయలుదేరాడు చంద్రం.

వెళ్ళబోతూన్న చంద్రంతో "ఆయన్ని ఎలాగైనా బ్రతికించు" అందామని నోటిదాకా వచ్చికూడా ఊరు కొంది. 'వేరే చెప్పాలేమిటి? రక్తస్పర్శే చెబుతుంది. ఏవీ తెలీకుండానే వాడి మొహం దిగాలుపడిపోవేదూ. ఆయన అలాంటి పరిస్థితిలో ఉంటే?' అనుకుంది. కాని తీరా చంద్రం వీధిమలుపు తిరిగాక 'అయ్యో! చెప్పి ఉండవలసిందే' అని బాధపడింది. చెబితే ప్రమాదం లేదూ - సంగతేమిటని ఆరా తీసి అనుమానపడితే?

ఇలా బాధతో భయంతో వ్యాకులంతో, ఆయన ఎలా ఉంటారో అనే ఆవేదనతో మనస్సు ఏమీ స్థిమితం లేక పిచ్చిదానిలా నాలుగు గదుల్లోనూ అటూ ఇటూ తిరి గింది. ఏం జరుగుతుందో అనే బెంగతో గుండె బరువెక్కి-

వెంక టేశ్వరస్వామి ఫొటో దగ్గరికి వెళ్ళి స్వామి పాదాలదగ్గర తల పెట్టుకుని ఏడ్చిఏడ్చి, 'ఆయనకి నెమ్మదిస్తే నీ కొండకి వస్తాన'ని మొక్కుకుంది. ఆ తరువాత వెళ్ళి సందువా పెట్టె తెరిచింది.

అందులో అట్టడుగున పాతచీరలో రహస్యంగా దాచిన 'కుమార్' ఫొటోతీసి గుండెల కద్దుకుంది. నవ్వుతూన్న ఆ ఫొటోని చూసేసరికి, దాదాపు పాతికేళ్ళ క్రితం, యౌవనం తనలో కెరళ్ళు కెరళ్ళుగా పొంగి ప్రవహిస్తూన్న సమయంలో మొదటిసారిగా చూసిన కుమార్ రూపం కళ్ళల్లో మెదిలింది రత్తాలుకి.

అప్పటికి తానింకా రత్తాలుగా మారలేదు. పదహారు సంవత్సరాల పాలపొంగులో ఉన్న రత్నం మాత్రమే. ఆయన కూడా ప్రతిఅణువులోనూ మగటిమిని నింపుకొన్న పాతిక ముప్పై ఏళ్ళ అందగాడు.

రోజూలాగా ఆ రోజుకూడా తనుకూడా తను కడవ చంకని పెట్టుకొని కూనిరాగాలుతీస్తూ చెంగు చెంగున గెంతుతూ కాలవకి నీళ్ళకోసం వెళ్ళింది. కాని ఆయన్ని చూడ గానే చట్టున పాట ఆపుచేసి, ఎంతో అందంగా మరెంతో విలాసంగా కాలువగట్టున పచ్చగడ్డిమీద పడుకున్న ఆయన్ని రెప్ప వాల్చకుండా చూసింది. ఇంత అందంగా ఉన్న ఈయ నెవరు! తన కళ్ళని ఇంతగా ఆకట్టుకున్న ఈ మగాడిని ఇంత క్రితం ఈ ఊళ్ళో ఎప్పుడూ చూడలేదే! ఒక్కొక్క గడ్డి పరకే తుంపి నీళ్ళల్లో వేస్తూ అది నీళ్ళలో పోతూంటే కని

పించినంతదాకా చూసి చంటిపిల్లాడిలాగ ఆడుకుంటున్నారేవిటి ?

అబ్బ! ఆ సిల్కు లాల్చీ, గ్లాస్కో పంచె తెల్లగా ఆయన ఒంటిమీద ఎలా మెరిసిపోతున్నాయో! కళ్ళకి జోడూ చేతికి వాచీ ఎవరో డబ్బున్న ఆసామీలాగే ఉన్నారు. పచ్చగా బలంగా అందంగా ఉన్న ఆయన్ని ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనే అనిపిస్తోంది. ఆయన అందాన్ని కళ్ళతో తాగుతూ రెప్ప వాల్చకుండా ఆయన్ని చూస్తూ అలా ఎంతసేపు ఉండిపోయిందో!

ఎవరేనా చూస్తే?

ఆయనే వెనక్కితిరిగి చూస్తే ?

ఈ ఆలోచన రావడంతో గుండెల్లో నుంచి ఏదో భయంతో కూడిన వణుకు బయలుదేరింది. ఇంక అక్కడ నిలబడలేక పోయింది. అయిష్టంగా కాలువకేసి కదిలింది. కావాలనే కడవని చప్పుడయేలాగ నీళ్ళల్లో ముంచింది. చప్పుడు వినికూడా ఇటుతిరిగి చూడడేం? అంత పరధ్యానం ఏమిటి బాబూ! అవసరం లేకపోయినా ఆ రోజున మళ్లీమళ్లీ కడవ పుచ్చుకొని కాలవకి వచ్చింది.

ఇలా రోజూ జరుగుతోంది. ఎప్పుడూ ఒళ్ళంతా కళ్ళు చేసుకొని తనే ఆయనకేసి చూడ్డంకాని ఆయనెప్పుడూ ఇటుతిరిగి తనకేసి చూడందే! ఓ రోజున కడవ చంకనెట్టుకుని అయనకేసి అదేపనిగా చూస్తూ నిలబడి ఉంటే పక్క పొలం లోంచి 'అయ్య' ఆ దారిని వచ్చాడు. వస్తూనే ఆయన్ని చూసి

నోట్లోంచి చుట్టతీసి అవతలపడేస్తూ "దండాలండి బాబయ్యా" అన్నాడు. అయ్యకి ఆయన తెలుసన్నమాట! తను అక్కడ నిలబడి ఉండటం అయ్యకంట ఎక్కడ పడుతుందో అని భయపడి గబగబా వచ్చేసింది. రాత్రి అన్నంపెట్టి అయ్య దగ్గర కదలేస్తే అయ్యే చెప్పాడు. "ఆయనేనే మన జమీందారు గారు. ఇప్పుడు మనం ఉంటున్న తోట, చేస్తున్న చేనూ అంతా ఆయనదే! పాపం, ఈ మధ్యనే భార్య పోయింది. దాంతో విరక్తి వచ్చేసి ఏడాది నలుసుని తీసుకొని పట్నంనుంచి పల్లెకి తిరిగి వచ్చేశారు" అని– ఈమధ్యనే ఆయన భార్య పోయిందనీ, ఈ లోకంలో ఆ మహారాజుకి ఏడాది కొడుకు ఒకడుతప్ప ఇంకెవ్వరూ లేరని వినేటప్పటికి తన ప్రాణం మరీ విలవిల్లాడింది.

ఆ రోజు మామూల్లాగా అయ్య పడవ వొచ్చే వేళకి పెరుగు కావిడ సర్దుకొని పట్నంపోవడానికి సిద్ధం అయినప్పుడు ఎప్పుడూ లేంది తనకి భయం వేసింది. "ఒక్కత్తైనీ, రాత్రిళ్లు ఉండలేకపోతున్నాను. నువ్వు పెరుగు అమ్మడం మానెయ్యి. వ్యవసాయం చేసుకుంటే మనకి గడవదు కనకనా?" అంది. అయ్య తనకేసి చూసి అదో మాదిరిగానవ్వి "ఇంకెన్నాళ్ళే ఇబ్బంది! ఆ లచ్చన్నగాడికి ఫేకటరీలో కాయం నవుకరీ అయిపోతే నిన్నాడికి ఇచ్చేస్తా. దాంతో నీ బెంగా తీరుతుంది. నా బరువూ తీరుతుంది. ఆ డిప్పు డెంత మనిషి అయ్యాడనుకున్నావు? మీసకట్టూ, మెలిదిరిగిన జబ్బా ఎంతో ముచ్చటగా ఉన్నాడు" అంటూ అయ్య పెరుగుకావిడి ఎత్తుకొని వెళ్ళిపోయాడు.

అయ్యా మాటల్ని విన్నప్పుడు తనకి సిగ్గుతో ఒళ్ళంతా గగుర్పొడిచింది. తను చిన్నప్పుడు అయిదో క్లాసులో చదువుకొన్న పుస్తకం అట్టమీద ఉన్న రాములోరూ సీతామ్మవోరూ బొమ్మ జ్ఞాపకం వచ్చింది. మొన్న మొన్నటి దాకా తను పనిచేసిన పెద్దకాపుగారింట్లో వాళ్ళ అమ్మాయీ అల్లుడూ ఆడుకునే పరాసికాలూ నవ్వులూ జ్ఞాపకం వచ్చాయి. ఈ లచ్చన్న రావువోరంత అందంగా ఉంటాడా? పెద్దకాపుగారి అల్లుడిలాగా చదువుకున్నాడా? ఏమో తనకి నమ్మకంలేదు. అందమూ చదువూ అంటే అదిగో ఆ జమీం దారు గారిలాగ ఉండాలి. జమీందారుగారిని తలచుకుంటేనే తన ఒళ్ళు ఒక్కమారు ఝల్లుమంది. అలా ఝల్లుమన్న ప్పుడు బాధగా సుఖంగా అదో గమ్మత్తుగా అనిపించింది. ఆ అనుభవం కొత్తగా ఉంది తనకి. ఈ మధ్య తనకి చాలా కొత్త అనుభవాలు కలుగుతున్నాయి. మొన్న స్నానంచేద్దాం అని చెరువులో దిగబోయే ముందు నీళ్ళల్లో తన బొమ్మని తాను చూసుకుంటే చచ్చేటంత సిగ్గేసింది. అప్పటిదాక సిగ్గంటే ఏవిటో తెలియని తనకి అది ఒక సరికొత్త అను భవం.

ఎలాగేనా చూస్తోందికదూ ? ఈ కొద్ది రోజులలోను తనలోఎన్నో మార్పులు వస్తున్నాయి. తూర్పు పడమర కొండలమీద సూర్యుడుపూసే బంగారుపూతల్నీ, చందమావ వేసే వెండిగిలాబాల్ని చూస్తూంటే చెప్పలేనంత ఆనందం కలుగుతోంది. తనకీమధ్య ఎగిరే పక్షులూ, హోరున కురిసే వానా, గట్లను కోసుకుంటూ గెంతుతూ పొర్లిపోయి పరి

గ్లైసేనీళ్ళూ, శీతా కాలపు చలిగాలులూ, వేసవి మల్లెల వాస నలూ ఒక ఉమ్మిటి తనచుట్టూఉన్న ప్రతి అందమూ తనలో చక్కిలి గింతలు పెడుతోంది. ఆ అందాల్ని చూస్తూ తరుచు పరధ్యానంగా ఉంటూ ఉండడంవల్ల అయ్యచేత సన్నసన్నగా చివాట్లుకూడా తింటోంది అప్పు డప్పుడు.

పక్కని పడవలు పోయే పంట కాలువ. కాలవవార నే కొబ్బరి, మామిడి, దబ్బ, దానిమ్మచెట్లతో దట్టంగా అందగా ఉన్న తోటా, తోటమధ్యపాకలో ఒంటరిగాతను, అయ్య పగ లంతా దూరంగా ఉన్న వరిచేలోనూ, రాత్రంతా పట్నానికి పెరుగుపట్టుకెళుతూ రహదారీ పడవల్లోనూ గడుపు తూంటే, బిక్కుబిక్కు మంటూ అంత పెద్దతోటలో మారుసాయం లేకుండాఉన్నతనకి ఆవూదూడా, జున్నుకోళ్ళు,బాతూలు, ఇవీ స్నేహితులు.

ఈ మధ్య తనకి ఆవుదూడ లొంగడంలేదు. పూర్వం లాగ బెండులాగ పరిగెట్టి దాన్ని పట్టుకోలేక పోతుందితను. ఓ రోజున అది కాలవగట్టుదాకా తనని తీసుకు పోయి తిప్పిం తాలు పెడుతూ ఉంటే చెంగు బొడ్డులో దోపుకొని పళ్ళు బిగబట్టి నుదురుమీద చెమటపట్టి ఆయాసం వచ్చేదాకా తరిమి తరిమి ఇంక తరమలేక ఆగి చూద్దునుకదా, జమీం దారుగారు తన కేసే నవ్వుతూచూస్తూ తను పడుతున్న శ్రమని కనిపెడుతున్నారు.. సిగ్గుతో తను వెనక్కి తిరిగి వచ్చేస్తూంటే ఆయన దూడని తరిమి పట్టుకొని 'ఇదిగో తీసుకు వెళ్ళు' అని దాని కన్నితాడు తన కందిస్తూంటే గుండె ఎంతో వేగంతో కొట్టుకు పోయిందని !

ఇంకోరోజున వాకిట్లో ఒత్తుగా కళ్ళాపుజల్లి ఒంగుని అందంగా ముగ్గులు పెడుతూంటే దగ్గరగా వచ్చి ఎవళ్లో నుంచున్నట్లనిపించిందితనకి. తలఎత్తిచూస్తే ఆయన.

"దాహంగాఉంది. కొబ్బరినీళ్ళు కావాలి" అన్నారు. ఆసమయంలో ఆయన వస్తారనీ అలాఅడుగుతారనే ఊహించచ లేదేమో, ఒక్కక్షణం నివ్వెరబోయి అలా నిలబడి ఉండి పోయింది. ఆయన మళ్లా అడిగారు. అప్పుడు ఈ లోంకలోకి వచ్చి తడబడుతూ "అయ్యాలేడు. చెట్టు ఎవరు ఎక్కుతారు?" అందితను. ఆయనేం మాట్లాడకుండా నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

ఆ తర్వాత అనుకొంది. 'ఎంత పొరబాటు చేశాను!' అని. ఆయనతోటకి ఆయనవచ్చి దాహం కావాలంటే 'లేదు పొమ్మ'ందితాను. ఇప్పుడెలాగ? చేసినతప్పు దిద్దుకోవాలంటే ఏం చేయాలి? ఇలా ఆలోచిస్తూఉంటే ఓ పక్కనుంచి చేతిలో ముగ్గంతా ధారగా కారిపోయి, జున్నుకోళ్ళ కాళ్లు ఆనమాళ్లు పడి, అది అంతా చిందర వందరగా అయి అదోక అందంగా అయింది.

ఆలోచించి ఆలోచించి చివరకి గెడకర్రతో ఓ కొబ్బరి బొండాం పొడిచి పడగొట్టి కత్తితో అందంగా చెక్కి కాలవగట్టు దగ్గిరికి, ఆయన కూచున్న చోటికి, వెళ్ళింది. ఆయన అటుతిరిగి పరధ్యానంగా కూచున్నారు. తాను వచ్చినట్లు ఆయనకెలా తెలియపరచడం. ఎంత ప్రయత్నం చేసినా శబ్దం కంఠందాటి బయడకురాందే! చివరకి ఎలాగైతేనేం అతి ప్రయత్నంమీద "ఇది....గో" అనగలిగింది. ఆయన ఇటుతిరిగి

తనకేసి తనచేతిలోఉన్న కొబ్బరిబోండాం కేసి ఆశ్చర్యంగా చూసి చిన్నగా నవ్వారు. ఆనవ్వులో ఎన్నో అర్థాలు. మరి మీ అయ్య లేడుగా? చెట్టుమీంచి కాయ ఎలా దిగివచ్చింది? ఇందాక నిర్దయగా పొమ్మన్నావుకదా ఇంతలో జాలి కలిగిందా? ఇలా రకరకాల అర్థాలు ఆ నవ్వుకి. నీళ్ళుతాగేసి ఆయన విసిరేసిన ఖాళీ బోండాం కాలవలో మునుగుతూ తేలుతూ పోతూఉంటే, దాన్నిచూస్తూ ఉన్నతనకి ఇవీ అని స్పష్టంగా చెప్పలేని భయాలు, బ్రతుకుగురించి సందేహాలు, ఆలోచనలతో గుబులువేసి, ఇంక అక్కడ ఒక్కక్షణంకూడా ఆగలేక తడబడే కాళ్ళతో తోటలోకి రెండు అంగల్లో వచ్చి పడింది.

అలా ఆలోచనలతో గుబులువేసింది ఆ ఒక్కసారేనా? లక్షసార్లు. ఓ మాటు తానెంతో గారాబంగా నీళ్ళు పోసి పెంచుకుంటూన్న మల్లెపందిరి దగ్గర నిలబడితే, ఒళ్ళంతా తెల్లని నవ్వులు నింపుకుని అది తనని హేళన చేస్తున్నట్లు అనిపించింది ప్రక్కనున్న గున్న మావిడిని అందుకోబోతున్న మల్లెతీగని చూస్తే తనకి ఆలోచనలతో ఎంత గుబులు వేసిందని! వేడిఎక్కి చమటపట్టిన శరీరంతో వాగిపోయి, తోటమధ్యనున్న చెరువులో దిగితే, తనవెనకాలే ఒక్క ఉదుటున బాతులన్నీ వచ్చి చెరువులో ఉరికాయి. హఠాత్తుగా అవి అలా ఉరకడంతో పరధ్యానంగా ఉందేమో ఝడుసుకొంది. పైగా నీళ్ళు చెదిరి తలంతా తడిసి పోయింది. దాంతో కోపంవచ్చి కింది పెదిమి పంటితో నొక్కిపట్టి వాటి

మీద నీళ్ళు చిందగొడుతూ, వాటితో సమానంగా ఈదు తూంటే గట్టుమీంచి ఎవరో పకపకా నవ్వినట్టయింది. తీరా చూస్తే ఆయన! మావిడిచెట్టు మసకనీడలో నిలబడి తనవేపే చూస్తున్నారు. తనకి వల్లమాలిన సిగ్గువేసింది. చేతులురెండూ గుండెలకి అడ్డంగా పెట్టుకుని తడిబట్టలేనా పిండుకోకుండా చెంగున పాకలోకి దూకింది. అప్పుడూ అంతే! ఏవేవో ఆలోచనలు. గుండెలని గుబులెక్కించే ఆలోచనలు.

ఇలా ఉండగా ఆయన నాలుగైదు రోజులు కనిపించడం మానేశారు. కాలవగట్టుకికూడా రావడంలేదు. అందుకు బహుశా ఆయనకి తనమీద కోపం రావడమే కారణమోమో! ఏమంటే అయిదారురోజుల్కితం తనుప్రాణంకంటే ఎక్కువగా చూసుకొంటూన్న మల్లెపందిరి దగ్గర నిలబడి అప్పుడే విచ్చిన ఓ పువ్వు కోసుకున్నారు. తనకి కోపం ఆగక "ఎందుకు కోశారు నన్నడక్కుండా" అంది కటువుగా. "ఇంకెప్పుడూ కొయ్యనులే" అని మృదువుగా అనేసి తలవంచుకొని నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయారు. తర్వాత బాధపడింది 'అయ్యో ఆయన మనస్సు నొప్పించానే' అని. ఇప్పుడాయన కనిపించడం మానేస్తే, అదేకారణం అనుకొంది. మనస్సువికలం అయింది. పనేం తోచటం లేదు.

ఇలా ఉండగా ఓ రోజున అయ్య అసలు సంగతి చెప్పాడు "జమీందారుగారికి వారంరోజులనుంచి జ్వరం" అని. వెళ్ళిచూసి వస్తానని అయ్యబయలు దేరితే. నేనూ వస్తానని అయ్యతో ఆయన ఇంటికి వెళ్ళింది 'ఎలా ఉన్నారో చూడాలనే' కంగారుని బయటకి కనిపించనియ్యకుండా.

ఆయన ఒళ్ళు తెలియకుండా మంచం మీద పడు కున్నారు పక్కనొక ఈజీచైర్‌లో కూర్చుని పేపర్ చదువు కుంటూ మధ్యమధ్య వాచీ చూసుకొంటోంది పట్నంనుంచి వచ్చిన డాక్టరమ్మ. తెగమారాం చేస్తూన్న చంటిబాబుని ఊరుకో బెట్టలేక వరండాలో సతమత మవుతున్నాడు నౌఖరు. తను చట్టున వెళ్ళి కుర్రాడిని తీసుకొని కబుర్లుచెప్పి బిస్కట్లు పెట్టి పాలు తాగించింది. తనుచంటిబాబుని నిద్దరోగొడుతూ న్నంతసేపూ అయ్యా డాక్టరమ్మా ఏవేవో మాట్లాడు కుంటూనే ఉన్నారు. ఆ తర్వాత అయ్య తనతో "నిన్నో నాలుగు రోజులు డాక్టరమ్మ ఇక్కడ ఉంచెయ్య మంటోంది. నువ్వు చంటిబాబుని పడుకో బెట్టడం ఓర్పుగా కబుర్లు చెప్పడం చూసి, నీలాంటిది ఉండి వేళపట్టుని జమీందారుగారికి మందు ఇస్తూ, ఆరఆరగా ఐస్ బేగ్‌తో ఆయన నుదురూ తలా కనక కాస్తే ఆయనకి జ్వరం తగ్గుతుందిట – మనకి ఆయనకంటే ఎక్కువేమిటమ్మా–నాలుగురోజులపాటు ఇక్కడేఉండు. నువ్వు వచ్చేదాకా నే నేదో గంజికాచుకుంటూ తంటాలు పడ తాలే!" అన్నాడు.

మర్నాడు పొద్దుటే అయ్యగారికి జ్వరం చూసి డాక్ట రమ్మ సంతోషంగా "ఆఁ!" నార్మల్ వచ్చేసింది. పాపం రాత్రి తెల్లవార్లూ నిద్దర లేకుండా ఆ అమ్మాయి ఐస్ బేగ్‌తో మీ నుదురు కాస్తూనే ఉంది." అంటూ గట్టిగాఅంది– ఆయన కృతజ్ఞతతో తనకేసి చూశారు నీరసంగాకళ్ళు తెరచి. తనకి చెప్పలేనంత సిగ్గేసింది.

"జ్వరం తగ్గింది కనక నేనోమారు పట్నం వెళ్ళి అక్కడ పేషెంట్లు ఏమయ్యారో చూసివస్తాను. నేను వచ్చేదాకా కుమార్ గారిని వదిలి నువ్వు వెళ్ళకు" అంటూ డాక్టరమ్మ పట్నం వెళ్ళింది. అంత ఇంట్లోనూ ఆయనా తనూ తప్ప ఇంకెవరూ లేరనే ఆలోచన వచ్చేప్పటికి భయంతోనూ, తత్తరపాటు తోను తనకి ముచ్చెమటలూ పట్టి భయంతో గుండె వేగంగా కొట్టుకొనేది. మందూ పళ్ళరసం అవీ ఆయనకి అందించే ప్పుడు ఆయన వేళ్ళు తనకి తగిలినా, పొరబాటుని తన కళ్ళ ల్లోకి ఆయన చూసినా, 'ఎంత శ్రమపడుతున్నావు రత్నం' అంటూ పలకరించినా, తనకి ఒళ్ళంతా ఝల్లుమని సుఖంగా అనిపించేది. విచిత్రమైన ఉద్రేకానందాలతో కూడిన తియ్యని బాధతో, ప్రతి క్షణమూ మరుపురాని ఒక మధుర స్మృతిగా అక్కడ అయిదారు రోజులు గడిపి ఇంటికి వచ్చేశాక ఏదో పోగొట్టుకున్నదానిలా తనకి అనిపించేది. మనస్సులో ఏదో బెంగగానూ బాధగానూ ఉండేది.

దానికితోడు అయ్య పరిస్థితి ఏం బాగోలేదు. తను లేని నాలుగు రోజులూ చెయ్యి కాల్చుకోవడంవల్ల, పొయ్యి పొగ పడక పాతదగ్గు మళ్లా తిరగబెట్టింది. పైగా కొత్తగా గుండె పోటొకటి వచ్చింది. ఖంగ్ ఖంగ్‌మని దగ్గుతూ వుండడం, వెంటనే 'అమ్మో' అని గుండె పట్టుకొని గిలగిల్లాడడం. అయ్య పడుతున్న అవస్థ చూస్తుంటే తనకి దుఃఖం గుండె ల్లోంచి ఉబికి వచ్చేది. చుట్టూ వున్న పొలాల్లో రైతులూ, అయ్యకి నేస్తాలుగా ఉన్నవాళ్ళూ రోజూ వచ్చి చూసిపోతు తున్నారు. వాళ్ళంతా 'అయ్యో' అనగలుగుతున్నారేకాని,

అవసరం అయిన సహాయం ఏమీ అందించలేకపోతున్నారు. అయ్య పరిస్థితి జమీందారుగారికి చెబితేనో! పట్నం నుంచి ఆ డాక్టరమ్మని పిలిపించి అయ్యకి వైద్యం చేయిస్తారు. కాని జమీందారుగారితో ఈ విషయం ఎలాగ చెప్పడం? ఆయన్ని చూస్తేనే తనకి సిగ్గుకదా!

ఇలా ఉండగా ఓ రోజున జమీందారుగారి నౌఖరు అయ్యని చూడడానికి వచ్చాడు. అతనివల్ల తెలిసిందేమిటంటే జమీందారుగారు ఊళ్లో లేరని, చంటిబాబుని పెంచడం ఆయనవల్ల కాకపోతోందనీ,దానికితోడు 'అబ్బాయిభవిష్యత్తు బాగుండాలంటే మీ కోరిక ప్రకారం డాక్టరు కావాలంటే మంచి శిక్షణవున్న ఏ నర్సరీలోనైనా చేర్పించండి' అని డాక్టరమ్మ సలహా ఇచ్చిందనీ, అందువల్ల వారం రోజులయి ఆయన పట్నం వెళ్లారనీ, కుర్రవాడికి బాగా అలవాటయి ఒక్కడూ ఉండగలిగేదాకా ఆయనకూడా పట్నంలోనే ఉంటారనీ చెప్పాడు ఆ నౌకరు. ఆయన ఊళ్ళో లేరని తెలియడంతో తనకి ఉన్న ఆశ కాస్తా సన్నగిలిపోయి, ఆ నౌకరు చెప్పిన మాటలు కొన్ని వినిపించాయి కొన్ని విని పించలేదు...

తన నీ లోకంలో ఏకాకినిచేసి అయ్య తన దారి తను చూసుకొని అప్పటికి వారం రోజులయింది. ఏడ్చి ఏడ్చి కళ్ళూ, అలసి అలసి గుండెలూ ఎండిపోయాయి. బ్రతుకు గురించి కొండంత భయమూ రేపు అంటే తగని దిగులుతో నిర్జీవ ప్రతిమగా మారిపోయిన తాను ఓరోజున తోట మధ్య వున్న చెరువుగట్టు అంచుమీద నిలబడి దూరాన్న ఊదు

తూన్న బాతుల జంటని శూన్యంగా చూస్తోంది. వెనకనుంచి 'రత్నా' అని చల్లని పిలుపు వినిపించడంతో ఉలిక్కిపడి ఇటు తిరిగేలోగా కాలికింద ఉన్న మట్టిబెల్లు విరిగి చెరువులోకి పడిపోబోయింది. ఇంతలో తనని తటాలున పొదువుకున్న ఆ చేతులు ఎంత హాయిగా ఉన్నాయని! పచ్చని మల్లె పందిరిలాగా చల్లగాఉన్న జమీందారుగారి స్పర్శతో ఒళ్ళంతా పులకించి తన్ను తాను మరిచేలా చేసింది. అయ్యోపోయి గుండె చెదిరిపోయి ఉన్న తనకి ఇలా ఓ ఆత్మీయుని ఆలనతో సేదదీరినట్లయింది. పాటుపడ్డ ప్రాణం కనుక తేలగా అయి, తను ఏం చేస్తుందో, చేస్తూన్నది మంచో చెడ్డో ఏం అర్థం కాక యే ఆలోచనా లేకుండా ఆయన గుండెలమీద తలఆన్చి, చేతుల్ని ఆయన మెడకి చుట్టేసి బావురుమంది. చాలాసేపు ఈ లోకాన్ని మరిచి అలా ఉండిపోయింది. ఆ తర్వాత కాని తను చేసిన పని ఏమిటో అర్థం కాలేదు. అర్థం అయేసరికి తనలో విపరీతమైన సిగ్గూ, ఆ సిగ్గుని మించిన బలీయమైన కోరికా బయలుదేరాయి. అయిష్టంగా ఆయనకు దూరంగా నిలబడ్డాను చేతులు ఆయన మెడమీంచి తీసేసి. అయ్యాపోయినందుకు ఆయన బాధపడుతూ, నాకు ధైర్యం చెబుతూ, దేశంలో ఇలా వైద్యసహాయం సరిఅయినదిలేకే చాలామంది చనిపోతున్నారనీ, అందువల్లే ఎంతో పట్టుదలతో తన కొడుకుని డాక్టర్ చెప్పించాలని నిశ్చయించుకున్నాననీ చెప్పారు. వేరే ఆలోచనలతో మెదడు వేడెక్కి, గుండెలు ఉద్వేగంతో తను ఆ మాటల్ని సరిగా వినడమేలేదు. కాస్సేపటికి ఆయన "వస్తా - మళ్ళా రేపో ఎల్లుండో వస్తాను" అంటూ కదిలారు.

తనకి ఆపుకోనంత ఉద్రేకం వచ్చింది. బరువెక్కిన శరీరాన్ని తన వశం తప్పుతూన్న హృదయాన్ని అక్కడో స్తంభానికి ఆన్చి, నన్నీ స్థితిలో వదిలి వెళ్ళిపోతారా?' అంటూ దీనంగా అంది. ఆయన నిలిచిపోయారు. తన హృదయంలో మాట ఆయనకి ఎలా చెప్పడం, ఇన్నాళ్ళనుంచి ఈ సమయంకోసం తపస్సు చేశానని ఆయనకి ఎలా తెలియపర్చడం? ఆయన స్పర్శకై ఒళ్ళంతా పులకిస్తూన్న తనని తాను ఆయనకి ఎలా ఎరుక పరుచుకోవడం? ఏమీ చెప్పలేక తన అశక్తతమీద తనకే బాధ కలిగి చేసేదేంలేక స్తంభానికి తల కొట్టుకుంటూ ఏడవసాగింది. ఆయన కంగారుగా వచ్చి 'రత్నా ఏవిటది?' అంటూ తనలోకి తీసుకున్నారు – తన జన్మ సార్థకం అయింది – బయట కొబ్బరి చెట్టుమీంచి పండొకటి రాలింది. తలుపు గడియవేసి వచ్చి తను కుమార్ ఒళ్ళో వాలింది...

ఆ మర్నాడు ప్రొద్దుటకానీ జరిగిన దేవిటో ఆలోచించగల స్థితికి రాలేదు తను. తలుచుకొనేసరికి ఒళ్ళు భయంతో జలదరించింది. ఆయనపై ఉన్న పట్టలేని వ్యామోహం కారణంగా తను ఎంత పని చేసింది?...ఇప్పుడెలా? ఏవిటి చెయ్యడం?...దీనికంతకీ తనే కారణం. ఆయనదేం తప్పులేదు. తనమీద ఆయనకా అభిప్రాయం ఎప్పుడూ లేదు. తనే ఆయనకా అభిప్రాయాన్ని అవకాశాన్ని కలిగించి చొరవ తీసుకుంది. ఆయనేం చేస్తాడు? పాపం మగవాడు!!

తనిలా ఆలోచనలతో కన్నీళ్లు పెట్టుకుంటూ కూర్చుంటే ఆయన లాలనగా దగ్గరకి తీసుకొని "అయినదానికి విచారిస్తావు ఎందుకు రత్నం? ఇంకీజన్మకి ఆనందం

లేదని నిరాశచేసుకొన్న ఈ నిర్భాగ్యుడికి మళ్ళీ జీవితం మీద అనురక్తిని కల్పించావు - నిన్ను మరచిపోను - ఈ కుమార్ నీకు అన్యాయం చెయ్యడు-నమ్ము-కావలిసే ప్రమాణం చేస్తాను" అంటూ తనచెక్కిలిమీద రెండుపెదవులతోనూ ప్రమాణం చేశాడు.

కుమార్ తన ప్రమాణాన్ని అక్షరాలా పాటించారు. చంద్రం ఇంకో రెండు మూడు నెలలకి పుడతాడనగా ఆయన తనని మద్రాసు తీసుకువెళ్లారు. అప్పటిదాకా ఆయన ఒక్క-రోజుకూడా తనని ఆదరించకుండా మానలేదు. జీవితంలో తియ్యని రోజులన్నీ కుమార్‌తో గడిపింది. మద్రాసు తీసుకు వస్తూ అన్నారు " ఇప్పటిదాక ఎలాఉన్నా ఇప్పుడింక ఆ పల్లెటూళ్ళో ఉండలేవు. నలుగురూ నాలుగు రకాలుగా కాకుల్లా పొడుస్తారు. ఇప్పటికేమన ఇద్దరి గురించీ గుసగుసలు బయలు దేరాయి. నిన్నిప్పుడు హాస్పిటల్‌లో చేర్పించడానికి మద్రాసు తీసుకు వెళుతున్నాను. పండంటి పాపాయిని నాకు ఇవ్వాలి. ఆ తర్వాత కూడా నిన్ను ఇక్కడో ఇల్లుచూసి ఈ మద్రాసు లోనే ఉంచేస్తా - అప్పుడప్పుడు నేనువచ్చి చూస్తూ ఉంటా"

ఆ ప్రకారం చంద్రానికి మూడేళ్ళు వచ్చేదాకా వారానికో మారువచ్చి చూసి వెళుతూ ఉండేవారు. ఆతర్వాత రెండు మూడు నెలలదాకా ఎందువల్లో ఆయన కబురు తెలియలేదు. ఆ తర్వాత ఓ రోజున టపాలో ఓ ఉత్తరం, దానితో పాటు ఆయనఫోటో, ఓ బేంక్ ఎకౌంటు పుస్తకం వచ్చాయి.

రత్నం - అబ్బాయి పరిస్థితి ఏం బాగోలేదు. వాడికి చదువు వచ్చేలాగ కనిపించడంలేదు. స్నేహాలు ఎక్కు-

వయ్యాయి. ఈ వాతావరణంనుంచి తప్పించడంకోసం, చదువు మీాద మళ్లా ఆసక్తి కలిగించడం కోసం రెండు మూడేళ్ళు వాడిని ఈ దేశంఅంతా తిప్పుతాను. నాకూ పుణ్యక్షేత్రాలు అన్నీ చూసినట్టు అవుతుంది. నేను ప్రతిసంవత్సరము మూడు వేలు వడ్డీవచ్చేలాగ కొంతడబ్బు బేంక్ లో వేశాను. బేంక్ వారు ప్రతి ఏప్రియల్ ఒకటికే నీకాడబ్బు పంపుతారు. దానితో చంద్రాన్ని బాగా చదివించు. వాడేనా డాక్టరు అయితే ఆనందిస్తాను" అని రాశారు.

అంతే - మళ్ళీ ఆయన కబురు తెలియలేదు. నాలు గైదు సంవత్సరాలు చూసి తను మద్రాసు వదిలి వచ్చేసింది. పల్లయ్యాగూడెం కబురుచేస్తే కుమార్ కబురుకాని ఆయన ఎక్కడ ఉంటున్నదీ తెలియలేదు. చివరకి నిరాశ చేసుకుంది. పట్టుదలగా చంద్రాన్ని డాక్టరీ చదివించింది. ఇంతవా డయ్యాడు. ఈ ఊరు ట్రాన్స్ఫరయి వచ్చాక ఇదిగో ఇవాళ ఇలా ఆయన కబురు తెలిసింది.

చంద్రం డాక్టరు అయాడని కుమార్ కి తెలియబరిస్తే ఆయన ఎంత సంతోషించునో అని ఎన్నిమార్లో అనుకొంది. కాని ఆ అవకాశం తనకి యెప్పుడూ లభించలేదు.

ఇదిగో - ఇప్పుడు - ఇన్నాళ్ళకి!

కాని ఎంత భయంకరంగా వచ్చింది ఈ అవకాశం!

ఆయన పరిస్థితి ఎలా ఉందో! ఎప్పుడూ కంగారుపడని వాడు చంద్రంకూడా కంగారుపడుతూ వెళ్లాడు. ఎలా ఉన్నారో ఏమయిందో సమయం మించిపోకుండానే చంద్రం

సంగతి కుమార్, కుమార్ విషయం చంద్రానికీ చెప్పి ఆ తండ్రీ కొడుకుల్ని ఇద్దర్నీ కలపాలి! ఇద్దరూ ఎంత సంతో షిస్తారని! డాక్టర్ అయిన చంద్రాన్ని కుమార్ కౌగలించు కుంటే తాను చూడాలి "నాన్నగారిని చూపించు అమ్మా ఎక్కడున్నారు ఆయనను ఒక్కమాటు చూపించు" అంటూ జ్ఞానం వచ్చింది మొదలు అటమటించిపోతున్న ఆ కుర్ర నాగమ్మకి ఆయనని చూపించి తండ్రి కౌగిలిలో కరిగి పోతున్న చంద్రాన్ని చూస్తే - తన జన్మ కంతకంటే ఏంకావాలి? ... వెళ్లాలి. ఇంక ఆలశ్యం చెయ్యకూడదు. హాస్పిటల్‌కి పరుగెత్తుకుని వెళ్లాలి - వెళ్లాలి.

సుడిగాలిలా హాస్పటల్‌కి పరిగెత్తుకొని వచ్చినఅమ్మని చూసి నిర్ఘాంతపోయి నిలబడిపోయాడు చంద్రం - రత్తాలు కంగారుగా "ఏరీ? ... పల్లయ్యాగూడెం జమీందారుగారు ఎక్కడ? ... ఎక్కడున్నారు" అంటూ చంద్రాన్ని కుది పేస్తూ అడిగింది.

చంద్రానికి ఏం అర్థంకాక "ఏం అమ్మా! ఎందుకూ? అదిగో ఆ స్పెషల్‌వార్డులో ఉన్నారు" అన్నాడు. వెంటనే అతని చెయ్యి పట్టుకొని గబగబా అక్కడికి తీసుకొనిపోయి, జుట్టు అక్కడక్కడ నెరిసి మొహంలో ముడతలు ఏర్పడుతూ ఉన్న ఆ ఏభైఏళ్ళ కుమార్‌నీ ఇట్టే పోల్చుకొంది. కళ్ళు మూసుకుని ఉన్న కుమార్ మీద వాలి "ఏవండీ నేను - మీ రత్తాన్ని-ఇడుగో మనచంద్రం"అంటూ దుఃఖం పొర్లుకుపోయే కంఠంతో అంది రత్తాలు. కుమార్ నీరసంగా కళ్ళు తెరిచి రత్తాల్ని పోల్చుకొని ఆనందంతో ముఖం అంత బాధలోనూ

కాంతివంతంకాగా 'ఎన్నాళ్ళకి చూశాను రత్నం నిన్ను' అని ఆమె ముఖంమీద పడుతున్న జుట్టుని వెనక్కి తోస్తూ "రత్నం చిన్నబాబుకి చదువు రాలేదు. పూర్తిగా పాడై పోయాడు - మన చంద్రం అయినా" అనబోతూంటే-

"ఇదుగో మన చంద్రం" అంటూ రత్తాలు చంద్రాన్ని చూపిస్తూ, తెల్లబోయి చూస్తూన్న చంద్రంతో "మీ నాన్నగారురా" అంది.

మెళ్ళో స్టెతోస్కోపుతో కనబడ్డ చంద్రాన్ని చూసి కుమార్ ఆనందాన్ని పట్టలేక చేతులు జాపాడు. ఆ తండ్రీ కొడుకులు కౌగలించుకోవడం చూస్తే రత్తాలుకి ఆనందంతో ఒళ్లు గగుర్పొడిచి కళ్ళ నీళ్ళు నిండాయి.

చంద్రాన్ని కౌగిలించుకొన్న కుమార్‌కి, చంద్రం తను ఆశించినట్లు డాక్టర్ అయ్యాడని ఆనందంవల్లో, తను కొడుకుని జాగ్రత్తగా పెంచలేకపోయినా రత్నం అయినా సరిగా పెంచి చంద్రాన్ని డాక్టర్ చెయ్యగలిగింది అన్న సంతృప్తివల్లో, తిరిగి ఇన్నాళ్ళకి రత్నాన్నీ, చంద్రాన్నీ చూడగలిగానుగదా అనే తృప్తివల్లో, అయ్యో తన చిన్న బాబు అలా అయిపోయాడుగదా అనే బాధవల్లో, ఈ ఆనందాన్ని అనుభవించే యోగంలేదే తన ఆయుర్దాయం కొన్ని నిముషాల్లో ఉందే అనే ఆవేదనవల్లో - ఎందువల్లో - కళ్ళల్లోంచి రెండు చుక్కలు రాలాయి. చంద్రంకాని రత్తాలు కాని వాటి అర్థం ఏమిటో అర్థం చేసుకోలేక కుమార్ కేసి చూస్తూ నిశ్శబ్దంగా నిలబడి ఉండిపోయారు.